క్లుప్తంగా

కాలువ వద్దంటూ దీక్షలు



నిరాహార దీక్షలో పాల్గొన్న రైతులు

నర్సాపూర్: 'కొండపోచమ్మ కాలువ వద్దు సెమీ అర్బన్ ముద్దు' అంటూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 8వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ సంగారెడ్డి రీచ్–2 కాలువకు తమ భూములు ఇవ్వబోమని, భూములు తీసుకుంటే భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎకరానికి 60నుంచి 70లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. దీక్షలలో చెన్నాపూర్, పెద్దచింతకుంట, లింగాపూర్, బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన రైతులు నర్సింహారెడ్డి, మహేశ్‌గౌడ్, అంజాగౌడ్, చంద్రశేఖర్, కిష్టగౌడ్, పోచయ్య, అంజయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాల్ స్వస్థ్ కార్యక్రమం) ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ పలువురు విద్యార్థులకు రక్తహీనత, విటమిన్‌ల లోపం, థైరాయిడ్, చర్మవ్యాధులు, చెవి, నేత్ర సమస్యలు ఉన్నట్టు గుర్తించినట్లు చెప్పారు. సమస్యలు ఉన్నవారికి మందులు అందజేశారు. అవసరమైన విద్యార్థులను జిల్లా ఆసుపత్రికి పంపి మెరుగైన చికిత్స చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ శ్రీనివాస్, హెచ్‌ఎం నవీనజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణం



ఉత్సవాల్లో పాల్గొన్న శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): ఆషాఢమాస ఉత్సవాలలో భాగంగా రుక్మిణీ విఠలేశ్వరస్వామి కల్యాణం మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, జైహింద్ రెడ్డి, గంగారెడ్డి, భానుగౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ, మురళీ పంతులు, కృష్ణారెడ్డి, వెంకటేశం, శ్రీహరి, చంద్రశేఖర్, సాయిరాం, రాము, కరణం దాసు, రాజేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నాగరాజు



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

చేగుంట(తూప్రాన్): లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బుర్క నాగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా శుక్రవారం లయన్స్ ప్రతినిధులు లక్ష్మి, అమర్‌నాథ్ రావు, రామ్‌ఫణీందర్, శ్రీధర్ సమక్షంలో నూతన అధ్యక్ష కార్యదర్శులుగా నాగరాజు, రాంచంద్రం; కోశాధికారిగా సతీశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజలకు మరిన్ని సేవాకార్యక్రమాలను నిర్వహించి క్లబ్ పేరు నిలిపేందుకు కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ లింగమూర్తి, వీరబ్రహ్మం, చౌడం నర్సింహులు, సుఖేందర్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్

చేగుంట(తూప్రాన్): ట్రిపుల్‌ఐటీ పూర్తిచేసి ఉన్నత విద్యకోసం ప్రయత్నిస్తున్న మక్కరాజిపేటకు చెందిన పేద విద్యార్థిని భవానీకి సుగుణ రామ్మోహన్ ఎడ్యుకేషన్ చారిటీ ల్యాప్‌టాప్‌ను సమకూర్చింది. దానిని ఉపాధ్యాయుడు రంగారెడ్డి శుక్రవారం ఆమెకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం భవానీకి ల్యాప్‌ట్యాప్ అవసరం ఉందని గమనించి చారిటీకి తెలియజేయగా వారు ల్యాప్‌టాప్ పంపించారన్నారు.



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయులు

మట్టిరోడ్లకు మోక్షమెప్పుడు



బురదమయంగా మారిన జైత్రం–కొత్తవలియాతండా మట్టిరోడ్డు

ప్రపంచం ఎంత అభివృద్ధి చెందినా అడవి బిడ్డల బతుకులు మారడంలేదు. అందుకు ప్రధాన కారణం రహదారులు. రవాణా సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో గిరిజన తండాలు వెనుకబడే ఉంటున్నాయి. అతి ముఖ్యమైన విద్య, ఆరోగ్యం కూడా అందడం లేదు. రోడ్లు లేకపోవడం, ఉన్న ఆ మట్టిరోడ్లు కూడా గుంతలు పడడం, వర్షాల వల్ల బురదమయం కావడంతో మరిన్ని కష్టాలు తప్పడంలేదు.
– చేగుంట(తూప్రాన్)

- తండావాసులకు తప్పని తిప్పలు
- సమస్య తెలిపినా ఫలితం శూన్యం
- వర్షాకాలంలో దారులు బురదమయం
- బయటకు వెళ్లాలంటే భయం భయం

గిరిజనుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని గొప్పలు చెబుతున్న అధికారులు తండాల్లోని రోడ్ల నిర్మాణాలపై చొరవ చూపక పోవడంతో గిరిజనులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని గొల్లపల్లి శివారులోని జైత్రంతండా నుంచి కొత్తవలియాతండా వరకు ఉన్న మట్టిరోడ్డుతో కష్టాలు తప్పడంలేదు.

వర్షాకాలంలో మరిన్ని కష్టాలు

జైత్రంతండా నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే కిలోమీటర్ దూరంలో ఉన్న ఆ మట్టిరోడ్డు వరకు నడిచి వెళ్లాల్సిందే. విద్యార్థులు, తండా ప్రజలు నిత్యం ఈ దారిగుండానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇక వర్షా కాలంలో అయితే ఆ కష్టాలు వర్ణనాతీతం. మట్టిరోడ్డు బురదమయంగా మారి గుంతల్లో నీరుచేరుతుంది. గర్భిణులను అత్యవసర సమయంలో ఆస్పత్రికి తరలిచాలంటే వాహనాలు నడవని పరిస్థితి. కొత్తవలియా నుంచి జైత్రంతండా మధ్యలో నిలిచిన నీటితో చెరువును తలపిస్తుంది. దీంతో తమ పిల్లలను స్కూళ్లు, కాలేజీలకు పంపించేందుకు తండావాసులు భయపడుతుంటారు.

ఎన్నిసార్లు విన్నవించినా..

తండాల్లో మట్టిరోడ్ల స్థానంలో తారురోడ్లను నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వచ్చిన ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమైనా తమ తండాలకు తారురోడ్లు నిర్మిస్తుందనే ఆశతో ఉన్నామని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు రవాణా సౌకర్యం మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా తండాల గిరిజనులు కోరుతున్నారు.

విన్నవించినా చర్యలు లేవు..



తండాలను కలుపుతున్న మట్టిరోడ్లను తారురోడ్లుగా మార్చాలని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశాం. కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదులు ఇచ్చాం. ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు, నాయకులు స్పదించి మా రోడ్లను మెరుగుపరచాలి.
– సుభాష్ నాయక్, జైత్రం తండా

ప్రతిపాదనలు పంపించాం

జైత్రంతండా నుంచి గొల్లపల్లిరోడ్డు అలాగే జైత్రంతండా నుంచి దౌల్తాబాద్ రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే ప్రారంభిస్తాం. మండలంలోని మరికొన్ని తండాల్లో రోడ్లు నిర్మించేందుకు కూడా ప్రయత్నిస్తాం.
– మధుసూదన్, ఏఈ, పంచాయతీరాజ్

పెద్దమ్మతల్లికి ఆషాఢ మాస పూజలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని శెట్టిపల్లిలో కొలువైన పెద్దమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఆషాఢ మాస పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన నరేశ్ గౌడ్ దంపతులు అమ్మవారికి వెండి కిరాటాన్ని బహూకరించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామం పాడిపంటలతో తులతూగాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

పేదలకు ఉచిత వైద్యం అందించండి

దళిత నాయకుల వినతి

మెదక్ కలెక్టరేట్: అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లోను పేదలకు పదిశాతం ఉచిత వైద్యం అందించాలని, దానికి సంబంధించిన ప్రభుత్వ జీఓను అమలు చేయక పోవడం అన్యాయమని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ అమలు చేసి పేదలకు ఉచిత వైద్యం అందేలా చూడాలని కోరుతూ శుక్రవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జీఓ ప్రకారం ఉచిత సేవలు అందించని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి వాటిని బేఖాతర్ చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా మెదక్‌లోని వెల్‌కమ్ బోర్డుతోపాటు అంబేడ్కర్, హవేలిఘణాపూర్, నర్సాపూర్ చౌరస్తాలలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటు



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చేయాలని కోరినట్టు తెలిపారు. విగ్రహాలపై వివక్షతో వ్యవహరిస్తున్న ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మైసయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, మురళి, సామెల్, రాజు, విఠల్ స్వామి, ఎల్లం, నర్సింహులు, చంద్రంయాదులు తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు ఉండొద్దు



డ్రమ్ములను పరిశీలిస్తున్న సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఎంపీఓ ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పలు గ్రామాలలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఉన్న డ్రమ్ములు, టైర్లు, పాడేసిన కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలు, పాడైన కూలర్లలో నీరు నిలిస్తే దోమలు విజృంభించి సీజనల్ వ్యాధుల బారిన పడతారన్నారు. డ్రైనేజీల్లో బ్లీచింగ్, ఆయిల్‌బాల్స్ వేయించామని చెప్పారు. కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఎంపీఓకు సన్మానం

హవేళిఘణాపూర్(మెదక్): ఎంపీఓగా పనిచేసిన ప్రశాంత్ బదిలీపై చేగుంటకు వెళ్తున్న సందర్భంగా సిబ్బంది శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రఘు మాట్లాడుతూ ఎంపీఓ ప్రజలకు చేసిన సేవలను ప్రశంసించారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మొక్కలను అందించండి

చిన్నశంకరంపేట(మెదక్): వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను అందించాలని ఎంపీడీఓ దామోదర్ ఆదేశించారు. అంబాజీపేట, శాలిపేట, రుద్రారంలో శుక్రవారం మొక్కలు నాటారు. మాజీ సర్పంచ్‌లు సాయిలు, పోచయ్య, లక్ష్మణ్, కార్యదర్శులు, ఈజీఎస్ ఏపీఓ రాజ్‌కుమార్, టీఏ సంపత్ పాల్గొన్నారు.

రుణమాఫీతో రైతులకు ఎంతో మేలు



టేక్మాల్(మెదక్): తంప్లూర్‌లో నాయకుల సంబరాలు



వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి–అరెగూడెంలో..

జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రైతులు, కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రుణాలు మాఫీ చేయడంపై రైతులకు సంతోషం వ్యక్తం చేశారు.



చేగుంట(తూప్రాన్): చేగుంటలో..

రూ.28.34కోట్ల రుణాలే లక్ష్యం

ఏపీఎం సంగమేశ్వర్



సమావేశం నిర్వహిస్తున్న ఏపీఎం

కౌడిపల్లి(నర్సాపూర్): డ్వాక్రా మహిళలకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.28.34కోట్లు రుణాలు ఇవ్వడం లక్ష్యంగా నిర్దేశించామని ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 646 సంఘాలు ఉన్నాయని అందులో 540సంఘాలకు రూ.28.34కోట్లు రుణాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు 68 సంఘాలకు రూ.7.5కోట్లు రుణం ఇచ్చామని చెప్పారు. అలాగే స్త్రీనిధి ద్వారా రూ.1.65కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.52 లక్షలు రుణం ఇచ్చామని, అర్హులైన ప్రతి గ్రూపు సభ్యులకు స్వయం ఉపాధికోసం రుణం ఇస్తామని చెప్పారు. అనంతరం ఎస్‌బీఐ మేనేజర్ నర్సయ్య మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు రుణాలు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్‌ఎమ్ గంగారామ్, ఐకేపీ సీసీలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్

తూప్రాన్: విద్య, వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని పుట్టకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆమె విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం గురించి వివరించారు. అలాగే చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు 800 నోట్‌బుక్స్‌తోపాటు పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహిజొద్దీన్, కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నాయకులు నార్సోజి, నాగరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హాజరు శాతం పెంచడం తప్పనిసరి

ఎంఈఓ నీలకంఠం



సమావేశంలో ఎంఈఓ

కొల్చారం(నర్సాపూర్): ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చూడడం, హాజరు శాతం పెంచడం తప్పనిసరి అని మండల విద్యాధికారి నీలకంఠం ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ప్రమాణాలతో విద్యార్థులకు బోధించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలకు పెంపునకు బోధనలో నూతన పద్ధతులను అవలంబించాలని సూచించారు. మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులను పాఠశాలకు తిరిగి వచ్చేందుకు కృషిచేయాలని కోరారు.

ముదిరాజ్ సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర నాయకుల డిమాండ్



తూప్రాన్: వినతి పత్రం అందజేస్తున్న నేతలు

తూప్రాన్/పెద్దశంకరంపేట(మెదక్)/వెల్దుర్తి (తూప్రాన్)చిన్నశంకరంపేట(మెదక్)/హవేళిఘణాపూర్ (మెదక్): రాష్ట్రంలోని ముదిరాజుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, జనార్దన్ డిమాండ్ చేశారు. మహాసభ మండల అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయలక్ష్మికి, ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగరాజుకు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009లో ముదిరాజులను బీసీ(డీ) నుంచి బీసీ(ఎ)లోకి మార్చాలని ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకూ అమలు కాలేదన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డ్ ఏర్పాటుచేసి నిధులను కేటాయించాలని కోరారు. 50 యేళ్లు నిండిన వారికి ఆసరా పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములు, సత్యనారాయణ, శ్రీనివాస్, యాదగిరి, అజయ్, ఆంజనేయులు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దశంకరంపేట మండల ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో తహసీల్దార్ గ్రేస్‌బాయికి వినతిపత్రం అందజేశారు. పున్నయ్య, శ్రావణ్, సంగమేశ్, మాణిక్యం, స్వామి, రవీందర్, సాయిలు, రాములు పాల్గొన్నారు. అలాగే వెల్దుర్తి తహసీల్దార్ తులసీరాం, మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతికి ఆయా మండలాల అధ్యక్షులు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. నర్సింహులు, శ్రీనివాస్, స్వామి, నర్సింహులు, గోపాలకృష్ణ, పోచయ్య పాల్గొన్నారు. నార్సింగి మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో యాదగిరి, సత్యనారాయణ, రమేశ్, స్వామి, రాజేశ్, తదితరులు తహసీల్దార్ కరీమ్‌కు వినతి పత్రం అందించారు. హవేళిఘణాపూర్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రమేశ్, రాములు, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

భయం భయం.. విద్యుత్ స్తంభం



కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

పాపన్నపేట(మెదక్): విద్యుత్ స్తంభం నేల మట్టానికి విరిగి కూలడానికి సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏడుపాయల పుణ్యక్షేత్రానికి వెళ్లే దారిలో ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. విషయం తెలిసి రెండు నెలలు కావస్తున్నా అధికారులు మాత్రం అటువైపు తొంగి చూడడంలేదు. ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. నాగ్‌సాన్ పల్లి నుంచి ఏడుపాయలకు వెళ్లేదారిలో కిలోమీటర్ దూరంలో ఈ ప్రమాదం పొంచి ఉంది. ఏడుపాయల ప్రఖ్యాతి చెందిన దేవాలయం కావడంతో నిత్యం వేలాది మంది భక్తులు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఇన్‌చార్జి డీఎంలకు సన్మానం**

నర్సాపూర్: ఆర్‌టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ సుధ బదిలీ కావడంతో ఆమెను సిబ్బంది శుక్రవారం మెదక్ డిపో ఆవరణలో ఘనంగా సన్మానించారు. డిపో మేనేజర్‌గా వచ్చిన సురేఖకు స్వాగతం పలికారు. ఆయా విభాగాల ఉద్యోగులు వెంకట్‌గౌడ్, రాంప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **పీఆర్టీయూ సభ్యత్వ నమోదు**

రామాయంపేట(మెదక్): జిల్లా పరిధిలో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సబ్బని శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలోని పలు స్కూళ్లలో శుక్రవారం సభ్యత్వ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం పాత పింఛన్ స్కీంను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆశయ్య, ప్రమోద్, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

◆ **జీఓను రద్దు చేయాలి**

నర్సాపూర్: టీచర్లు, ఆయాలకు నష్టం కలిగించే జీఓ 10ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్తున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, జానాబాయి, నాగరాణి, లత, శశికళ, స్వరూప, శ్యామల, యాదమ్మ, మంజుల పాల్గొన్నారు.

◆ **అంగన్వాడీ 'బడిబాట'**

పెద్దశంకరంపేట(మెదక్): అమ్మ మాట – అంగన్వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలో అంగన్వాడీ టీచర్లు శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ రెండున్నరేళ్ల లోపు పిల్లలను బడిలో చేర్పించారు. అంగన్వాడీలో చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడీ –2 టీచర్ విజయనిర్మల సూచించారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి తనవంతు కృషి చేశానని ఫైజాబాద్ గ్రామానికి చెందిన యూత్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన రూ.25వేలు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.

◆ **నోట్‌బుక్స్ పంపిణీ**

తూప్రాన్: పురపాలక పరిధి అల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, చాట్స్, స్టేషనరీని పంపిణీ చేశారు. పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్‌రావు, ప్రవీణ్, సతీశ్ పట్నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ అన్ని దానలలోను విద్యాదానం గొప్పదన్నారు. పేద విద్యార్థులకు జీఎమ్మార్ అండగా వుంటుందని చెప్పారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మావతి, జయంతి, జ్యోతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

◆ **గురుపూజ మహోత్సవం**



శివ్వంపేట(నర్సాపూర్): శ్రీవ్యాస పౌర్ణమి సందర్భంగా బగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం గురుపూజ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వేదపండితుడు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. అన్నదానం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.